క్లుప్తంగా

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న చైర్‌పర్సన్ దంపతులు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో బుర్జు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సొంత వార్డులో నూతనంగా నిర్మించిన మైసమ్మ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంజుల దంపతులు, కాలనీ వాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన, గణపతి హోమం, రుద్ర హోమం, నవగ్రహ పూజలు ఈ సందర్భంగా నిర్వహించారు. ప్రజలందరూ బాగుండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

బాల్యవివాహాలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ తదితరులు

బషీరాబాద్: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చైల్డ్‌లైన్ డివిజన్ కో–ఆర్డినేటర్ ఎర్ర వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కేజీబీవీలో చైల్డ్‌లైన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. బాల, బాలికల హక్కులకు బంగం కలిగితే 1098కు ఫోన్ చేయాలని, బాల్యవివాహాలు జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు. మైనర్లకు పెళ్లి చేయడం నేరమని, అలా చేస్తే.. తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల ఇన్‌చార్జి హన్మంత్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అల్తామస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు అభివృద్ధి చెందాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: బ్రాహ్మణ సంఘం సభ్యులు సహాయ సహకారాలు అందించుకుంటూ అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని శ్రీమహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పండితుడు శ్రీనివాసాచార్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనగరేశ్వర దేవాలయంలో సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శంకర సేవాసమితి క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణులు ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని చెప్పారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి పంచామృతంతో రుద్రాభిషేకం, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాహ్మణ సమితి తాలూకా అధ్యక్షుడు అక్కి లక్ష్మణ్‌రావు, ఆలయ అర్చకులు బాలాజీ, నారాయణపేట బ్రాహ్మణ సంఘం శాంతారాం, కొడంగల్, తాండూర్, బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బంట్వారం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని సల్బత్తాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. 40 రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతుందని, పదో తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలపై దృష్టి సారించాలని ఎంఈఓ సూచించారు. ఇంటి వద్ద శ్రద్ధగా సబ్జెక్టుల వారిగా బాగా చదువుకోవాలన్నారు. ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం చెప్పారు. హెచ్‌ఎంలు రవికుమార్, నాగజ్యోతి, సీఆర్‌పీ నర్సింహులు, ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఫోన్‌లను హ్యాక్ చేయడం సిగ్గుచేటు

పరిగి: సమాచార గోప్యత పాటించడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆనంద్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 1న డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను ప్రభుత్వం హ్యాక్ చేసిందని ఆరోపిస్తూ.. ప్రభుత్వం ఆర్‌ఎస్ వ్యక్తిగత విషయాలను ఎందుకు తెలుసుకోవాలనుకుంటుందో అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న పార్టీ రహస్యాలను తెలుసుకునేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలన్నారు.

నాటడం.. వదిలేయడం



లింగంపల్లిలో నీరులేక ఎండిపోయిన మొక్కలు

- లెక్కల కోసమే మొక్కలు
- సంరక్షణ మరచిన అధికారులు
- పట్టించుకోని పంచాయతీలు..
- నవ్వులపాలవుతున్న హరితహారం
- బూడిదవుతున్న అవెన్యూప్లాంటేషన్ మొక్కలు

నవాబుపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హరితహారం కార్యక్రమం చివరకు నవ్వుల పాలవుతోంది. హరితవనం పేరుతో మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారే తప్పా.. వాటి సంరక్షణ గాలికి వదిలేస్తున్నారు! అవెన్యూప్లాంటేషన్ పేరుతో ఏటా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల ఇరువైపులా వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. లెక్కల కోసమో.. లక్ష్యం నెరవేరేందుకే కానీ.. వేలులక్షల్లో మొక్కలు పాతుతున్నారే కానీ.. వాటిని రక్షించే చర్యలు మాత్రం చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నాటడమే తమపని అన్నట్లుగా అధికారుల పనితీరు ఉందని, అవి వాడిపోయినా.. కాలిపోయినా వారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజాధనం వృథా..

ఏటా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. ఈ ఏడు ఒక్క నవాబుపేట మండలంలోని అక్నాపూర్, ఆర్కతల, అత్తాపూర్, చించల్‌పేట, చిట్టిగిద్ద, ఎత్‌రాజ్‌పల్లి, గంగ్యాడ తదితర గ్రామాల్లో 11 వేల మొక్కలు నాటారు. కానీ వాటి సంరక్షణ పట్టించుకోవడం లేదు. మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డిగాదం పెరిగిపోయి.. మొక్కల బతుకు ప్రశ్నార్థకంగా మారింది. మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలిగించక పోవడం, నిరు పోయకపోవడంతో.. మొక్కలు ఎండిపోయి గడ్డిలో కలిసిపోతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పుపెట్టడంతో.. మొక్కలు అగ్నికీలలకు ఆహుతవుతున్నాయి. ఇలా అనేకసార్లు జరిగినా.. అధికారులు కానీ.. పంచాయతీ సిబ్బంది కానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజాధనం వృథా అవడంతో పాటు.. హరితహారం పరిహాసంగా మారుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేవు: సర్పంచులు

మొక్కలకు నీరు పోయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్లకు ఇరువైపులా గడ్డిని కోపియ్యడం ఉపాధిహామీ సిబ్బంది చూసుకోవాలని పలువురు సర్పంచులు అంటున్నారు. ఇప్పటికే జీపీల్లో నిధులు లేక, చేసిన పనులను బిల్లులు రాక గ్రామాల్లో సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ కూలీలతో పిచ్చిమొక్కలు, గడ్డి కోపియ్యడం చేయాలని సర్పంచులు కోరుతున్నారు.

> **గ్రామ పంచాయతీలదే బాధ్యత**
>
> అవెన్యూప్లాంటేషన్‌లో భాగంగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోయడం, పిచ్చిమొక్కలు తొలగించడం ఆయా గ్రామపంచాయతీలదే బాధ్యత. ఉపాధిహామీ నుంచి 400 మొక్కలకు ఒక్క కూలీని పెట్టి.. కేవలం మొక్క చుట్టూ మీటర్ వరకు మాత్రమే పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయిస్తాము. మిగిలిన గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించి నీరు పోయాల్సిన బాధ్యత జీపీదే.
>
> – జ్యోతి, ఇన్‌చార్జి ఏపీఓ, నవాబుపేట

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరిగి: దళిత మహిళపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళ ఎర్ర రాములమ్మను రోడ్డుపైకి లాక్కొచ్చి, బహిరంగంగా దాడి చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రకులాల అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి కుటుంబ సభ్యులపై అగ్రవర్ణాలు నిత్యం దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, సత్తయ్య, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాడతెలియని జంట!

మర్పల్లి: కులాంతర వివాహం చేసుకున్న యువకుడి కుటుంబంపై తరుచూ దాడిచేస్తున్న వారిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు మాసయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. ఐనాపూర్‌లో 3 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన శ్రావణ్, బీసీ కులానికి చెందిన విజయ అనే యువతిని వివాహం చేసుకున్నారని చెప్పారు. పెళ్లి జరిగి మూడేళ్లు గడుస్తున్నా.. ఆ జంట జాడ కానరావడం లేదని వాపోయారు. శ్రావణ్ కుటుంబంపై తరచూ దాచి చేస్తున్న వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బషీరాబాద్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బషీరాబాద్: సీఎం సహాయ నిధి పేదలకు వరంలా మారిందని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన జగదీశ్వర్‌కు మంజూరైన రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమెల్యే బుధవారం అందజేసి మాట్లాడారు. సహాయనిధి కింద అందజేసే సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, రాజు, దస్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో నిర్వహించే జాతరకు రావాలని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో శేఖర్‌గౌడ్, వేణుగౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసారు. ఈ నెల 9,10 తేదీల్లో చెంగోల్లో పొచమ్మతల్లి జాతర నిర్వహిస్తున్నామని, ఉత్సవానికి రావాలంటూ ఆహ్వానించారు.

వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

వికారాబాద్ అర్బన్: విద్యతో పాటు ఇతర కళల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రం అంబేడ్కర్ భవనంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జానపద నృత్యాలు, గీతాలు, కబడ్డీ, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతగిరి: పీఆర్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు విజయ శ్రావణ్‌కుమార్, మల్లేశం, శ్యాంకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని జిల్లా పంచాయత్‌రాజ్ శాఖ అధికారి తరుణ్‌కుమార్, దౌల్తాబాద్ తహసీల్దార్ కృష్ణయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అధికారులు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

కొడంగల్ రూరల్: కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన గడ్డమీది రమేష్‌ను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రతి ఒక్కరు భక్తిమార్గం ఎంచుకోవాలి



పడిపూజలో పాల్గొన్న మాజీ మంత్రి చంద్రశేఖర్, జీవితరాజశేఖర్

మర్పల్లి: ప్రతి ఒక్కరు భక్తిమార్గాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని హన్‌మాన్ మందిరం వద్ద నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు జీవితరాజశేకర్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్‌తో కలిసి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, రమేష్‌రెడ్డి, బలరామ్‌గౌడ్, మధుకర్, శ్రీధర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి



ఎస్‌ఐకి ఫిర్యాదు అందజేస్తున్న హిందూవాహిని సభ్యులు

కొడంగల్ రూరల్: సరస్వతీ దేవతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెంజర్ల రాజేశ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హిందూవాహిని శాఖ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడిన రాజేశ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బైరి నరేశ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో స్టేజిపైన ప్రోత్సహించే విధంగా.. చప్పట్లు కొట్టిన వారిపై కేసు నమోదుచేయాలని ఎస్ఐ రవిగౌడ్‌కు ఫిర్యాదు అందజేశారు.

ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలి

ఎస్‌బీఐ మేనేజర్ సరస్వతి

షాబాద్: ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమాను చేయించుకొని ధీమాగా ఉండాలని షాబాద్ ఎస్‌బీఐ మేనేజర్ సరస్వతీ సూచించారు. బుధవారం ఎల్గోండగూడ గ్రామానికి చెందిన భూర్గుల యాదయ్య కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈతను సురక్ష బీమా యోజన కింద రూ.20లక్షలతో ఇన్సురెన్స్ చేశాడు. దీంతో అతని భార్య భారతమ్మకు రూ. 2లక్షలు నగదును బ్యాంకు మేనేజర్ సరస్వతీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి సంవత్సరానికి రూ.436 ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన చేసుకుంటే ప్రమాదవశాత్తు వ్యక్తి చనిపోతే రూ.2లక్షల ప్రమాద బీమా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఫరూక్, బాలకృష్ణ మధుసూదన్, అర్పిత్ రవి, శివపార్వతి తదితరులున్నారు.

ఘనంగా మహా పడిపూజ



మహా పడిపూజలో ఎమ్మెల్యే ఆనంద్, అయ్యప్ప భక్తులు

మర్పల్లి: హనుమాన్ మందిరం కమిటీ సభ్యుల సమక్షంలో అయ్యప్ప మాలధారులు మహా పడిపూజను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో మండపం మారుమోగగా.. 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు ఇరుముడి కట్టారు. పూజాకార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, జెడ్పీటీసీ మధుకర్, వైస్‌ఎంపీపీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. రాత్రి 8 గంటలకు మాలధారులు శబరికి వెళ్లారు. అనంతరం డీసీసీబీ మాజీ డైరెక్టర్.. ఎమ్మెల్యే, జెడ్పీటీసీకి శాలువలు కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు వినోద్‌శర్మ, శ్రీనివాస్, రవీందర్ సాగర్, పలువురు నాయకులు మల్లేశ్‌యాదవ్, నర్సింహులుయాదవ్, శేఖర్‌యాదవ్, రామేశ్వర్, దివాకర్, పాండునాయక్, మల్లేశం, సర్పంచ్ మైముదాబేగం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు లబ్ధిదారులకు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి: అనారోగ్యానికి గురైన వారికి సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డుకు చెందిన అవుసుల బిచ్చయ్య అనారోగ్యానికి గురికాగా.. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1లక్ష చెక్కును బుధవారం తన నివాసంలో అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్ ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్లు రవీందర్, కృష్ణ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, తాహేర్‌అలి, బాలాల తదితరులు పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి..

దుమ్ముధూళితో వాహనదారుల ఇక్కట్లు



కరన్‌కోట్‌మార్గంలో ఎగిసిపడుతున్న దుమ్ము

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామానికి వెళ్లే వాహనదారులు దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నారు. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్డు మరమ్మతుకు గురికాగా.. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును తవ్వి మట్టిపోసి, కంకరపరచడం మరిచారు. దీంతో దుమ్ము లేస్తూ.. వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గోపన్‌పల్లి, బెల్కటూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, కరన్‌కోట్, ఓగిపూర్‌తో పాటు పలు సిమెంట్ కర్మాగారాలకు వెళ్లేవారు దుమ్ముతో ఊపిరి ఆడడం లేదంటూ వాపోతున్నారు. సదరు కాంట్రాక్టర్ కంకర పోసేవరకైనా.. రెండుపూటలా మట్టిపై నీళ్లు చల్లాలని కోరుతున్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పయ్య

బంట్వారం: సమాజంలో పోలీసుల పాత్ర కీలకమైందని ధారూరు సీఐ అప్పయ్య అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ.. బుధవారం బంట్వారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహించరాదని, శాంతి భద్రతలను కాపాడుతూనే నేరాలను అరికట్టాలని చెప్పారు. అనంతరం తెలంగాణ సరిహద్దు గ్రామాలైన బొప్పునారం, తొర్మామిడి ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆనంద్‌కుమార్, ఏఎస్ఐ అంజాద్ హెచ్‌సీ పాండు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ అసెంబ్లీ పాలక్ ఆకుల విజయ



కార్యకర్తలతో అసెంబ్లీ పాలక్ విజయ

పరిగి: ప్రజా సమస్యలపై పోరాటం చేసి, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ అసెంబ్లీ పాలక్ ఆకుల విజయ సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో అసెంబ్లీ కన్వీనర్ నరసింహ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఎంతో దూరం లేవని, నాయకులు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని చెప్పారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నరసింహారెడ్డి, పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, ఘనపురం వెంకటయ్య, మల్లేశ్, రాములు, శ్రీనివాస్, కేశవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల వితరణ



గుర్తింపు కార్డులతో విద్యార్థులు

యాలాల: మండలంలోని ముద్దాయిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం మాజీ సర్పంచ్ విఠలయ్య కుమారుడు గౌరీ శంకర్.. ఐడీ (గుర్తింపు) కార్డులను ఉచితంగా అందజేశారు. గతంలో తాను ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన పాఠశాలకు ఏదో ఒక రూపంలో చేయూత అందించాలనే ఉద్దేశంతో ఐడీ కార్డులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ అహ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ రేష్మా బేగం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాములు, అనుసూయ తదితరులు ఉన్నారు.